క్లుప్తంగా

పారిజాతగిరిలో పూజలు



పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: భారీ వర్షాల్లో కూడా పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి వేకుజామున సుప్రభాత సేవ, తోమాల సేవ, ఆరాధన, తీర్థప్రసాద గోష్ఠి, బాలభోగ నివేదన అనంతరం స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. బుట్టాయిగూడెంకు చెందిన గద్దె గంగాధర్, శ్రీనాగలత, అప్పలరాజుగూడెంకు చెందిన ఇమ్మణి ఆదిత్య అన్నప్రసాద వితరణకు సహకరించినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. దాతలకు ఆలయ అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు, నల్లూరి రిషికేశ్ ఆచార్యులు, రాఘవాచార్యులు స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందించి, వేద ఆశీస్సులతో సన్మానించారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాత వెంకటేష్‌కు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శనివారం రూ.1,00,000 విరాళంగా అందజేశారు. ఏలూరులోని తంగెళ్లమూడికి చెందిన పి.వెంకటేష్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

శ్రీవారి సేవలో హిందూపురం ఎంపీ



హిందూపురం ఎంపీ పార్థసారథికి శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ అర్చకులు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి శనివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన గ్రామానికి చెందిన పుసులూరి శ్రీధర్‌తో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఎంపీకి స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. ఆతరువాత శ్రీవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోలం పిలుస్తోంది పోస్టర్లు ఆవిష్కరించిన దృశ్యం

కొయ్యలగూడెం: పొలం పిలుస్తోంది పోస్టర్లను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు ఏడీఏ బుజ్జిబాబు శనివారం పేర్కొన్నారు. బర్రింకలపాడులోని ఎమ్మెల్యే నివాసంలో ఈ కార్యక్రమాన్ని అధికారులు, రైతు నాయకులతో కలిసి నిర్వహించామన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తీర్ణ కార్యక్రమంలో భాగంగా వారంలోని ప్రతి మంగళ, బుధవారాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. రోజుకి రెండు గ్రామాలు చొప్పున వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొంటారని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బుజ్జిబాబు కోరారు.

అప్పారావు సేవలు అభినందనీయం



లైన్ ఇన్‌స్పెక్టర్ అప్పారావుకు సత్కారం

లింగపాలెం: రంగాపురం విద్యుత్ లైన్ ఇన్స్పెక్టర్ తెర్లి వెంకట అప్పారావు సేవలు అభినందనీయమని ఏఈ కూచిపూడి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. అప్పారావును పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాఖ అధికారులు వీ శ్రీనివాసరావు, ఎల్ఐవీ. బాబూరావు, లైన్‌మెన్ బీ దుర్గాప్రసాద్, వీ సతీష్, ఎం గాంధీ, బీ తిరుపతిరావు, సొంగ శ్రీనుబాబు, ఎన్.సాల్మన్‌రాజా పాల్గొన్నారు.

భారీ వర్షాలతో పొంగుతున్న కొండవాగులు

పోలవరం రూరల్: అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కొండ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎడతెరిపి లేని వర్షంతో పల్లపు ప్రాంతాల్లో రోడ్లపైన ఎక్కడికక్కడ వర్షం నీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలవరంలో శనివారం 26.4 మి.మీ వర్షపాతం నమోదైంది. గోదావరి వరద దిగువకు ఉండటంతో కొండవాగుల నీరంతా పొలాలు మీదుగా కడెమ్మ స్లూయిజ్ నుంచి గోదావరి నదిలోకి చేరుతోంది.

ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్ నుంచి నీరు విడుదల

ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్ నుంచి 240 క్యూసెక్కుల నీరు రెండు గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్‌లో 89.65 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. ఎఫ్ఆర్ఎల్ స్థాయి 90.50 మీటర్లు, కొండ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో ఉండటంతో వచ్చిన నీరు వచ్చినట్లుగా 240 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నీరంతా కొవ్వాడ కాలువ ద్వారా పట్టిసం ఔట్‌పాల్ స్లూయిజ్ నుంచి గోదావరి నదిలోకి చేరుతోంది.

రోడ్లు జలమయం

కొయ్యలగూడెం: తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు కొయ్యలగూడెం మండలంలోని పలు ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. శనివారం తెల్లవారుజాము నుంచి నిలకడగా కురుస్తున్న భారీ వర్షాలతో బయ్యనగూడెం సరిపల్లి రోడ్డు ముంపునకి గురి కాగా వరద నీరు రోడ్డుపై ప్రవహించింది. కన్నాపురం తూర్పు పడమటి కాలువలు ఉధృతంగా ప్రవహించాయి. ఎర్రకాలవ, బైనేరు ఉధృతి కొనసాగుతోంది.



పోలవరం రూరల్: ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం



కొయ్యలగూడెం: బయ్యనగూడెం సరిపల్లి మెయిన్ రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

కుక్కునూరులో భారీ వర్షం

కుక్కునూరు: అల్పపీడన ప్రభావంతో మండల వ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షం కారణంగా రోడ్లన్నీ జలమయమయ్యాయి. తొండిపాక, అమరవరం ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది.

కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

భారీ వర్షాల నేపథ్యంలో కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ వీవీ పెద్దిరాజు పేర్కొన్నారు. మూడు షిఫ్టుల్లో పనిచేసేలా సిబ్బందిని నియమించినట్టు చెప్పారు. ప్రజలు వారి ప్రాంతాల్లో భారీ వర్షాల ప్రభావం ఎక్కువగా ఉంటే వెంటనే కంట్రోల్ రూమ్ నెంబర్‌లు 83097 03949, 94923 62623లకు సమాచారం అందించాలని సూచించారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

ద్వారకాతిరుమల: మండలంలో శనివారం కురిసిన భారీ వర్షానికి పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అలాగే పంట పొలాల్లోకి భారీగా నీరు చేరింది. భీమడోలు – ద్వారకాతిరుమల ప్రధాన రహదారిలోని లక్ష్మీపురం, గొల్లగూడెం, పంగిడిగూడెం వద్ద రోడ్డుపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అలాగే స్థానిక కొత్త బస్టాండు వద్ద రహదారి పైనుంచి వర్షపునీరు భారీగా ప్రవహించింది.



ద్వారకాతిరుమలలోని కొత్త బస్టాండు వద్ద రోడ్డుపై భారీగా ప్రవహిస్తున్న వర్షపు నీరు

జంగారెడ్డిగూడెంలో కంట్రోల్ రూం

జంగారెడ్డిగూడెం: భారీ వర్షాల నేపథ్యంలో జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేశారు. ప్రజలు వారి ప్రాంతాల్లో భారీ వర్షాల ప్రభావం ఎక్కువగా ఉంటే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని ఆర్డీవో కె.అద్దయ్య సూచించారు. పడిపోయిన విద్యుత్ లైన్లకు, స్తంభాలకు దూరంగా ఉండాలని, పొంగిపొర్లే వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. వర్షాల నేపథ్యంలో డివిజన్ పరిధిలోని బుట్టాయగూడెం మండలంలో ఉన్న గుబ్బల మంగమ్మ గుడిని ఆదివారం మూసివేస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు. కావున భక్తులు ఈ విషయాన్ని గమనించి గుబ్బల మంగమ్మ గుడి ప్రయణాన్ని వాయిదా వేసుకోవాలన్నారు. కాగా ప్రజలు భారీ వర్షాల ప్రభావాన్ని 83097 05048 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు.

వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ద్వారకాతిరుమల: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ సూచించారు. ద్వారకాతిరుమల పంచాయతీ కార్యాలయాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, ఈఓపీఆర్డీ ఏవీ సుబ్బరాయన్‌తో కలిసి గ్రామంలో డ్రెయినేజీలు, తాగునీటి బోర్లు, పారిశుధ్యం నిర్వహణను పరిశీలించారు. అలాగే వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంచాయతీ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటున్నారా.. లేదా అన్న విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి డైరెక్టర్ కృష్ణతేజ, కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ఇతర శాఖల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ కంట్రోల్‌రూమ్‌కి వచ్చిన ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు కూడా కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వయోవృద్ధులు, పిల్లలు తోడులేకుండా బయటకు రావద్దని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలతో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని చెప్పారు. వర్షాలు తగ్గే వరకు సిబ్బందికి సెలవులు మంజూరు చేయబడవని డీపీఓ విశ్వనాథ్ తెలిపారు. అనంతరం తాగునీటిని పరీక్షా కిట్టు ద్వారా ఎలా పరీక్షిస్తున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంటం స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు తదితరులున్నారు.



పంచాయతీ కార్యాలయంలో తాగునీటి పరీక్షా కిట్‌ను పరిశీలిస్తున్న డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్

లోఓల్టేజీ సమస్యను పరిష్కరించండి

కుక్కునూరు: విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కుక్కునూరులో విద్యుత్ లోఓల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. స్థానిక గణేష్‌నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్ అయ్యి నెల రోజులు గడుస్తున్నా విద్యుత్ అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయలేదన్నారు. గణేష్ నగర్‌కు రామాలయం వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సప్లయి అందిస్తుండడంతో లోఓల్టేజీ సమస్య ఏర్పడిందన్నారు. విద్యుత్ సమస్య ఉందని ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారిని బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రజల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించే ఏఈ మోహన్ పాపారావుపై తగు చర్యలు చేపట్టాలని కోరారు.

తూర్పువీధిలో తాగునీటి సమస్య

ద్వారకాతిరుమల: స్థానిక తూర్పు వీధి ప్రజలను గత కొన్నాళ్లుగా తాగునీటి సమస్య వేధిస్తోంది. తరచూ బోర్లు, మోటార్లు మరమ్మతులకు గురవడంతో ఇక్కడ తాగునీటి సమస్య తలెత్తుతోంది. సమస్య వచ్చినప్పుడు పంచాయతీ అధికారులు తూతూమంత్రంగా చర్యలు చేపడుతున్నారని, దాని వల్ల ఫలితం ఉండటం లేదని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే గత రెండు మూడు రోజులుగా తాగునీరు అందక తాము తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, అధికారులు స్పందించాలంటూ పలువురు మహిళలు పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చారు. ఆ సమయంలో అధికారులు అందుబాటులో లేకపోవడంతో వారు అక్కడి నుంచి వెనుదిరిగారు.

స్పాట్ బిల్లింగ్ మీటర్ రీడర్ల ఆందోళన

కొయ్యలగూడెం: నేటినుంచి విద్యుత్ బిల్లింగ్ మీటర్ నమోదు ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ సంస్థలో మీటర్ రీడింగ్ నమోదు చేసే స్పాట్ బిల్లింగ్ మీటర్ రీడర్లు శనివారం పేర్కొన్నారు. కొయ్యలగూడెం సబ్‌స్టేషన్ వద్ద ఈ మేరకు వారు ఆందోళన చేపట్టారు. ప్రతి నెలా మీటర్ రీడింగ్ తీసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు బ్యాంకు ఖాతాలు తెరవమని విద్యుత్ సంస్థ ఆదేశించినప్పటికీ గుత్తేదారులు స్పందించకపోవడం పట్ల రీడర్స్ ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు ఒకరిపై ఒకరు వంతులు వేసుకొని బ్యాంకు ఖాతాలను తెరవకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో సెప్టెంబర్ ఒకటవ తేదీ నుంచి విద్యుత్ మీటర్ రీడింగ్ పనులను నిలిపివేసి ఆందోళన నిర్వహించాల్సిందిగా రాష్ట్ర కమిటీ సభ్యులు పిలుపు ఇచ్చారన్నారు. ఈ మేరకు సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి విద్యుత్‌శాఖ ఏఈకి వినతిపత్రం అందజేశారు.


విద్యారంగంపై నిర్లక్ష్య ధోరణి తగదు

జంగారెడ్డిగూడెం: శాస్త్రీయ ఆలోచలనతో విద్యార్థులు, యువత ముందుకు సాగాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఏలూరు జిల్లా కార్యదర్శులు కె.లెనిన్, జి.సూర్యకిరణ్ అన్నారు. శనివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో నిర్వంచిన జిల్లా ముఖ్య కార్యకర్తల శిక్షణ తరగతుల్లో వారు మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి పాఠ్యపుస్తకాల్లో మత ప్రచారం జరుగుతోందని, మరోపక్క యూనివర్సిటీలో పూజలు ఎలా చేయాలి, జాతకాలు ఎలా చూడాలనే కొత్త కోర్సులు తీసుకొస్తామని ప్రభుత్వ పెద్దలు అనడం సిగ్గుచేటన్నారు. దేశంలో నిరుద్యోగం రోజురోజుకు పెరుగుతూ, నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోతు, ప్రతి కుటుంబంలో ఆర్థిక భారం పెరుగుతున్నా ప్రభుత్వం ఇవి ఏమి పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. దేశంలో జీడీపీలో 16 శాతం విద్యారంగానికి కేటాయించకుండా కేవలం మూడు నాలుగు శాతం కేటాయించడంతో ప్రభుత్వం విద్యారంగంవైపు ఎంత చిన్నచూపు చూస్తుందో అర్థమవుతుందన్నారు. విద్యారంగంపై నిర్లక్ష్య ధోరణి తగదని అన్నారు. విద్యార్థి సమస్యలు తీర్చకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేయడానికి సిద్ధమని తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు జయంత్, మనోజ్, పోతురాజు, సీతారాములు, వెంకట సుబ్బారావు, అర్జున్, నరసారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యకిరణ్

పర్యావరణ హితానికి విలువనిస్తూ...



కన్నాపురం సమీపంలో మట్టి గణనాథుల విగ్రహాలను తయారు చేస్తున్న దృశ్యం



వాటర్ పెయింట్‌తో మట్టి గణనాథుడు

కొయ్యలగూడెం: పర్యావరణ హితానికి విలువనిస్తూ.. మట్టి గణనాథుల విగ్రహాలను తయారుచేస్తూ పలువురి మన్ననలు అందుకుంటున్నారు కంద్రికగూడెం గ్రామానికి చెందిన నాగవరపు సీతారాముడు. కేవలం కలప చెక్కలు, ఎండు గడ్డి, జిగురుమట్టి మిశ్రమ పదార్థాలను బొమ్మల తయారీలో ఉపయోగిస్తూ బొజ్జ గణపయ్య విగ్రహాలను భలేగా తీర్చిదిద్దుతున్నారు. ప్రారంభంలో ఒక్కడితో ప్రారంభమైన.. ఇప్పుడు సీతారాముడి బృందంలో పొన్నపల్లి సాయికుమార్, అంబటి యశ్వంత్, పొన్నపల్లి సూర్యతేజ చేరి విగ్రహాల తయారీలో సహకరిస్తూ మట్టి గణనాధులను తయారు చేసి విక్రయిస్తున్నారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో పోల్చితే మట్టి గణనాథుల విగ్రహాలు శ్రమతో కూడుకున్నవని, సమయం కూడా ఎక్కువ పడుతుందని సీతారాముడు తెలిపారు. ఇటుక బట్టి నిర్వాహకులైన వీరంతా గణపతి నవరాత్రుల సీజన్‌లో సాధారణ శిల్పులుగా మారి గణనాథుల విగ్రహాల తయారీని గత నాలుగు సంవత్సరాల క్రితం ప్రారంభించారు. ఆరు అంగుళాల విగ్రహం నుంచి ఆరున్నర అడుగుల ఎత్తులో మట్టి గణనాథుల్ని తయారు చేసి విక్రయిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల ధరతో పోల్చితే మట్టి గణనాథుల విగ్రహాలు ధర తక్కువగా ఉంటుందని, అదేవిధంగా ఆకర్షణీయంగా కూడా కనబడతాయని అంటున్నారు.

ఊరేగింపునకు అనువుగా ఉండేలా..



ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల మాదిరిగానే మట్టి గణనాథుల విగ్రహాలను తయారుచేస్తున్నాం. ఊరేగింపునకు సైతం అనువైన విధంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నాం. పర్యావరణంపై ఉన్న అవగాహనతో ఎక్కడా శిక్షణ తీసుకోకుండానే మట్టి విగ్రహాల తయారీ ప్రారంభించాను.

– నాగవరపు సీతారాముడు ప్రధాన శిల్పి, కంద్రిక గూడెం

నా వంతు సహాయంగా..



పర్యావరణానికి ప్రాధాన్యతనిస్తున్న యువకుల ఆదర్శాన్ని గుర్తించి మట్టి విగ్రహాలను తయారు చేసుకోవడానికి నావంతు సహాయంగా గోడౌన్ ఉచితంగా తయారీ కేంద్రానికి ఇచ్చాను. నాలుగు సంవత్సరాలుగా వారు రాణిస్తున్నారు.

– పాలమోలు శ్రీనివాస్, రైతు. కంద్రికగూడెం

వైభవంగా మహా పూర్ణాహుతి

- ఘనంగా పవిత్రావరోహణ
- లక్ష్మీపురం ఆలయంలో ముగిసిన పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం ఆలయంలో గత మూడు రోజులుగా జరుగుతున్న శ్రీనివాసుని దివ్య పవిత్రోత్సవాలు శనివారం జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ఆలయంలో పవిత్రావరోహణ, పూర్ణాహుతి, మహా శాంతి హోమాన్ని అర్చకులు, పండితులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం ఆలయ పండితులు, అర్చకులు స్నపన, తిరుమంజనాలను జరిపి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లపై, అలాగే ఇతర దేవతామూర్తులపై ఉంచిన దివ్య పవిత్రాలను తొలగించారు. ఆ తరువాత యాగశాలలో మహా పూర్ణాహుతి వేడుకను వైభవోపేతంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ డీఈవో బాబురావు, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



ఆలయ యాగశాలలో మహా పూర్ణాహుతిని నిర్వహిస్తున్న అర్చకులు

రోడ్లపైనే పశువుల సంచారం

ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు

చింతలపూడి: చింతలపూడి నగర పంచాయతీలో పశువుల బెడద ఎక్కువయ్యింది. ఇవి రోడ్డుపై యథేచ్ఛగా సంచరిస్తూ మొబైల్ స్పీడ్ బ్రేకర్లుగా మారి వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. పట్టణంలోని పాత బస్టాండ్, బోసుబొమ్మ సెంటర్, గాంధీబొమ్మ సెంటర్‌లలో మెయిన్ రోడ్డుపై విచ్చలవిడిగా తిరుగుతూ వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా 24 గంటలూ రోడ్డుపైనే నివాసం ఉంటున్నాయి. ఈ పశువులు ఎవరివో, ఎక్కడి నుంచి వచ్చాయో ఎవరికీ తెలియదని అంటున్నారు. ఒక్కోసారి ఇవి ఒకదానిపై మరొకటి కలబడినప్పుడు ఎవరిపై పడతాయో తెలియక వాహనదారులు, పాదచారులు హడలిపోతున్నారు. అంతే కాక వీటికి ఆహారం లభించకపోవడంతో కూరగాయల దుకాణాల వద్ద చేరి కూరగాయలను ఆరగిస్తున్నాయని వాపోతున్నారు. రాత్రి సమయాల్లో ఇవి యజమానుల ఇళ్లకు వెళ్లకుండా రోడ్లపైనే పడుకుని సేద తీరుతున్నాయి. దీంతో ఎండకు ఎండుతూ, చలికి వణుకుతూ, వర్షానికి తడుస్తూ అనారోగ్యం బారిన పడి కొన్ని పసువులు ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు లేకపోలేదు. మరికొన్ని వాహనాల కిందపడి గాయాల పాలై మృతి చెందుతున్న ఘటనలు కూడా ఉన్నాయి. గతంలో స్థానిక పోలీసులు వీటి బెడద నుంచి ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడానికి స్థానిక పంచాయతీ అధికారుల సహకారంతో ఇతర ప్రాంతాలకు తరలించి వాటి యజమానులకు సమాచారం అందించడంతో కొంతకాలం రహదారులపై పశువులు కనిపించలేదు. ఇటీవల మళ్లీ వీటి బెడద ఎక్కువయ్యిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి వీటి యజమానులకు నోటీసులు జారీ చేసి సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



చింతలపూడి పాత బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులు

అధికారులు స్పందించాలి



పట్టణంలో మూగజీవాలు ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. వాటికి ఆహారం, కనీసం సేద తీరడానికి స్థలం లేక రోడ్లపైనే సంచరిస్తూ ప్రమాదాలకు గురవుతున్నాయి. పశువుల యజమానులు రోడ్లపై మూగజీవాలు తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నగర పంచాయతీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

తొర్లపాటి బాబు,
ఏఐసీయూటీ జిల్లా సహాయ కార్యదర్శి